
కథా వలయం
ప ్రత్యేకం

రాత్రి పదిగంటలు దాటుతోంది.

సుందరమూర్తి టీవీ ఆఫ్ చేసి గదిలోకి వచ్చి మంచం మీద కూర్చున్నాడు.

తొమ్మిది గంటలకు వార్తలు చూసేసి టీవీ కట్టేస్తాడు. మళ్లీ ఉదయం ఏడు గంటలకు వార్తలు చూస్తాడు. అరగంటలోపు పేపరు చూస్తాడు.

అంతకు మించి పెద్దగా టీవీ చూడటం అతనికి ఇష్టం ఉండదు. ఎవరో 'పెద్దమనిషి' అన్నట్టు అతని దృష్టిలో అదొక ఇడియట్ బాక్స్! జీడిపాకంలా సాగే సీరియళ్లూ, సినిమాల మీద సాగే కార్యక్రమాలు, అర్థంపర్థంలేని 'పోటీ' కార్యక్రమాలూ అతనికి చాలా చిరాకు.

భార్య ప్రభావతి మాత్రం ఏవో రెండు సీరియళ్లు చూస్తుంది. అలాగని పరిసరాల్ని మైమరచిపోయి మాత్రం కాదు.

'ఏం చూస్తావ్ చెత్త సీరియల్స్?' అని భర్త సుందరమూర్తి అంటుంటాడు.

'మీకేం? మగ మహారాజులు. ఆఫీసయ్యాక కాస్సేపు అక్కడా, అక్కడా హస్కు వేసుకుని రిలాక్సయి ఇంటికి వస్తారు. మాకలా కుదర్దుమరి. ఆఫీసవగానే ఇంటికి రావాలి. ఈమాత్రం కూడా రిలాక్సవ్వద్దా?' అని ప్రభావతి అంటుంది.

ఆలోచించగా భార్య అన్న మాటల్లో నిజం ఉందనిపించిందతనికి.

'ఓ అరగంట ఆలస్యమైందంటే చాలు... మీ అమ్మ గేటులోనే నిల్చుంటుంది... ఏం ఆలస్యమైంది?... అంటూ అడుగుతుంది. మామూలుగానే అనుకోండి... కానీ, ఆ అడగడంలో నాకు 'నన్ను గురించి జాగ్రత్తా, ఆదుర్దా కన్నా – ఇప్పటిదాకా ఎక్కడ తిరిగావ్? అన్నట్లు ధ్వనిస్తుంది నాకు' – అని ఓ రోజు ప్రభావతి అన్న మాటలూ అతన్ని తరచూ కదిలిస్తుంటాయి.

తన తల్లి తత్త్వం అతనికి బాగా తెలుసు. కానివారికి కంచాల్లో, అయినవారికి ఆకుల్లో పెడతారంటారే – అలాంటి ధోరణి ఆవిడది.

ఇంట్లో పనిచేసే పనిమనిషిని నిలువనివ్వదు. తెగ వేధిస్తుంది. వీధిలో తమకు సంబంధం లేని మనిషి 'అమ్మా బాగున్నారా' అని పలకరిస్తే చాలు... ఆమెని పిలిచి కూరో, పండో చేతిలో పెడుతుందావిడ.

ఆ పెట్టేదేదో పనమ్మాయికి పెడితే అది కాస్త నమ్మకంగా, అభిమానంగా పనిచేస్తుంది కదా అంటుంది ప్రభావతి. ఇప్పటికే పనమ్మాయికి ఎక్కువ డబ్బులు ఇచ్చేస్తున్నామని ఆవిడ గోల చేస్తూంటుంది.

ఆమాటకొస్తే సుందరమూర్తి తండ్రే నయం. చాలా విషయాల్లో ఆయన భార్యని కట్టడి చేస్తుంటాడు – 'చూడు! వాళ్లిద్దరూ రెక్కలు ముక్కలు చేసుకుని ఉద్యోగాలు చేస్తూ మనకి ఏ లోటూ లేకుండా చూస్తున్నారు. నువ్వు పిచ్చిచేష్టలు చేసి ఉన్న పరువు పోగొట్టుకోకు...' అని అప్పుడప్పుడూ భార్యని మందలిస్తుంటాడాయన.

ఇవన్నీ రోజూ ఇంట్లో మామూలే అతనికి. అతనో కార్పొరేట్ కంపెనీలో ఉద్యోగి. భార్య జాతీయ బ్యాంకులో పనిచేస్తోంది...

వాళ్లకి ఆర్థిక సమస్యల్లేవు. తండ్రి సంపాదించి ఇవ్వలేదన్న బెంగా లేదతనికి. అత్తమామ లెక్కడికి పోతారు. చూడాల్సిన బాధ్యత తమది అనుకునే తత్త్వం ప్రభావతిది.

మరో పది నిముషాలకి ప్రభావతి గదిలో

**సర్వజిత్**

కొచ్చింది.

"పదిన్నరవుతోంది. ఈ ఇద్దరు వెధవలూ ఇంకా ఇల్లు చేరలేదు" అంది మంచం మీద కూర్చుని గోడకి ఆనుకుని. సుందరమూర్తి అసహనంగా ముఖం పెట్టాడు.

"ఎక్కడికి వెళ్లినా ఎనిమిదింటికి ఇల్లు చేరండిరా అని లక్షసార్లు చెప్పాను... మాట వింటేనా?... ఎసైన్‌మెంటు రాసుకోవాలని ఇది ఏడుగంటలకి వెళ్లింది. టెన్త్ నుంచి ఎఛీవ్‌మెంట్ టెస్టుంది. జిరాక్స్ కాపీలు తీయించుకోవాలని వాడు ఎనిమిదింటికి వెళ్లాడు. పదిన్నర దాటుతోంది. ఇంటిధ్యాసలేదు ఇద్దరికీ..." ప్రభావతి విసుక్కుంటూ అంది.

"ఇప్పుడు వెళ్లకపోతే కాలేజీ నుంచి వచ్చాక ఏం చేస్తున్నారు?" సుందరమూర్తి అసహనంగానే ప్రశ్నించాడు.

"ఏమో?... వస్తారుగా. మీరే అడగండి... ఇరవై నాలుగ్గంటలూ సెల్‌ఫోన్ చెవిలో పెట్టుకుని గంటలు గంటలు మాట్లాడ్డమేమిటో నాకేం అర్థకావడం లేదు... ఏమిటని అడిగితే... లెసన్ గురించి అడుగుతున్నాం అంటారు. ఫోన్ ఆఫ్ చేసి వాళ్లింటికి వెళ్లి తెలుసుకుని రమ్మంటావా? అంటారు... వెళ్లమన్నామనుకోండి... మళ్లీ ఇంటికి ఎప్పుడొస్తారో తెలీదు... ఏం చదువులో గానీ... ఛీ!ఛీ! చికాకొస్తోంది బాబూ..." గట్టిగా కణతలు రాసుకుంది ప్రభావతి.

సుందరమూర్తికి ఏం చెప్పాలో అర్థం కాలేదు. ఎవరి మాట విన్నా ఇదే గోల... ఈడొచ్చిన పిల్లలతో ఇవే సమస్యలు...

మారిన పరిస్థితుల్లో... కార్పొరేట్ విద్యా వ్యవస్థలో హడావిడి, టెన్షన్, పరుగులు పెట్టడమే. ఎంసెట్, ఐసెట్, ఈసెట్, క్యాట్, ఫలానా లక్ష్యం, ఫలానా చదువు అని లేదు... పదింటికి అప్లికేషన్లు పడేసి, ఈ సెట్, ఆ సెట్ అన్ని సెట్లూ రాసేసి, ఆనక దగ్గర్లో లేదా దూరంగా అయినా పేరున్న కాలేజీలో సీటు దొరికేదాకా ఒకటే టెన్షన్!

ప్రజల తాపత్రయం చూసి పుట్టగొడుగుల్లా ఇంజనీరింగ్, మెడికల్, ఇతర ప్రొఫెషనల్ కాలేజీలు పుట్టుకొస్తున్నాయి. కొన్ని కాలేజీల్లో చదివి సర్టిఫికేట్లు తెచ్చుకున్నా దానికి విలువ లేదని ఇచ్చిన వాడికీ తెలుసు, పుచ్చుకున్న వాడికీ తెలుసు!

సుందరమూర్తీ, ప్రభావతీ కూడా అలానే హైరానా పడ్డారు. అమ్మాయి స్మితని ఎం.సి.ఏ. లోను, అబ్బాయి కార్తీక్‌ని ఎం.బి.ఏ. లోనూ చేర్చారు. స్మితకి దాదాపుగా ర్యాంకుతోనే సీటొచ్చినా, కార్తీక్‌కి సీటు కొనుక్కోక తప్పలేదు.

నిజానికి పిల్లలిద్దరూ పర్వాలేదు. కాకపోతే కాస్త దుందుడుకు తత్త్వం.

ఇంతలో కాలింగ్‌బెల్ మోగడంతో – "వచ్చినట్లున్నారు..." అంటూ మంచం దిగి హాల్లోకి వచ్చింది ప్రభావతి. అప్పటికే అత్తగారు తలుపు తీసింది.

"టైమెంతయిందీ? ఇప్పటిదాకా ఏమిటీ తిరుగుళ్లూ? ఆడపిల్లవు కాదూ?" స్మిత లోపలికి అడుగు పెట్టడంతోనే అరిచిందావిడ. ప్రభావతి తలపట్టుకుంది.

"ఎప్పుడొస్తే నీకెందుకు?" స్మిత అదే స్థాయిలో అనేసింది.

"అవునే! నాకెందుకు మరి? నేనేమన్నా నిన్ను ఫీజులు కట్టి చదివిస్తున్నానా? మీ తాత చదివిస్తున్నాడా? మీ అమ్మానాన్నా వేలకు వేలు సంపాదించి మీకు వేలకు వేలు ఫీజులు కట్టి

చదివిస్తున్నారు. నువ్వేమో టింగురంగా అంటూ రాత్రిళ్లు షికార్లు చేసొస్తున్నావ్!"

"వస్తాను... నాయిష్టం..." విసురుగా అంది స్మిత.

"నోర్మూయ్యవే ముందు... నానమ్మతో ఏం టా వాదన? ఫలానా అందుకు లేటయ్యిందని చెప్పి చావొచ్చుగా..." మరింత రాద్ధాంతం కాకుండా ప్రభావతి చప్పున జోక్యం చేసుకుని స్మితని కోప్పడింది. కానీ స్మిత ఊరుకోలేదు.

"ఎందుకింత లేటయ్యిందని సౌమ్యంగా అడిగితే నేనూ అలానే చెప్పేదాన్ని. తిరుగు ళ్లూ... షికార్లూ అంటుందెందుకు మరి?"

"పెద్దముండాదాన్ని. ఓ మాట అనకూడదా! అనకూడదంటే చెప్పు... నువ్వెప్పుడొచ్చినా ఎలా తిరిగినా నోరుమూసుకొని కూర్చుంటాను" ప్రభావతి అత్తగారు నిష్టూరంగా అంది.

"నేనెక్కడా తిరిగి రాలేదు. ఫ్రెండింటికి వెళ్లి ఎసైన్‌మెంట్ చేసుకుని వచ్చాను." స్మిత గట్టి గానే చెప్పింది.

నానమ్మా, మనవరాలూ ఇలా వాదించు కూంటుంటే వాళ్లిద్దరికీ సర్దిచెప్పడానికి ప్రభావతి సతమతమయిపోయింది గానీ, ఆ గదిలోంచి మామగారు గాని, ఈ గదిలోంచి భర్తగానీ హాల్లో కి రాలేదు.

స్మితని కసిరి గదిలోకి లాక్కొచ్చింది ప్రభా వతి.

"ఇంత జరుగుతున్నా అలా బెల్లం కొట్టిన రాయిలా కూర్చున్నారేం?" భర్త మీద మండిప డింది ప్రభావతి.

"ప్రభా! నేను జోక్యం చేసుకుంటే సమస్య మరింత పెరుగుతుంది కానీ, తరగదని నీకూ తెలుసు... అయినా ఏమిటే స్మితా ఇంత రాత్రి దాకా ఇంటికి రాకపోవడం?" కూతుర్ని కసి రాడు సుందరమూర్తి.

"వర్క్ పూర్తికాలేదు డాడీ!... నసుగుతూ చెప్పింది స్మిత.

"సరే ఇంకెప్పుడూ ఇలా లేటు చెయ్యకు. వెళ్లు భోంచెయ్యి" అన్నాడు.

డైనింగ్ టేబుల్ దగ్గరకొచ్చి అన్నీ మూతలు తీసి చూసింది స్మిత. ఇంతలో మళ్లీ కాలింగ్ బెల్ మోగింది. అత్తగారు మంచం మీదనుంచి లేవబోతూంటే చప్పున ప్రభావతి వెళ్లి తలుపు తీసింది. కార్తీక్ వచ్చాడు.

"ఏవిట్రా ఇంత లేటు?" ప్రభావతి అడిగిం ది మందలింపుగా.

"జిరాక్స్ తీయించుకోవడం లేటయ్యింది మమ్మీ" మరో మాటకు అవకాశం ఇవ్వకుండా చెప్పులు విడిచి బాత్‌రూమ్‌కి వెళ్లాడు కార్తీక్.

"ఏమే... అన్నం తిను" ప్రభావతి గదిమింది కూతుర్ని.

"వాణ్ణీ రానీ..."

కార్తీక్ బట్టలు మార్చుకుని వచ్చి డైనింగ్ టేబుల్ ముందు కూర్చుంటూ "మెనూ ఏమి టక్కా?" అడిగాడు.

"నీ తలకాయ పచ్చడి, నా తలకాయ వేపు డూను" కంచాలు పెట్టి వడ్డిస్తూ అంది స్మిత.

"అంటే నాన్ వెజ్ డిషెష్ అన్నమాట... వాసన అదిరిపోతోంది కదూ...."

"వింటున్నా... మీ వెటకారాలు..." ప్రభావ తి అత్తగారు అన్నది వాళ్లకేసి కోపంగా చూస్తూ.

"ఛీ! బీరకాయ కూర... బోర్!..." స్మిత

అన్నది నెమ్మదిగా, నానమ్మని ఏం పట్టించు కోకుండా.

"డిటో సాంబార్..." కార్తీక్ అన్నాడు.

ప్రభావతి ఇద్దర్నీ కసిరి, తనే వడ్డించింది. అంతే కాదు - "మీరిలా వచ్చి పది నిమిషాలి క్కడ నిల్చోండి..." అని భర్త సుందరమూర్తిని పిలిచింది ప్రభావతి.

అతను హాల్లోకి వచ్చాడు. స్మిత కూర కెక్క రించినట్టు తిని మజ్జిగ పోసుకుని తిని లేచి వెళ్లిపోయింది. కార్తీక్ కాస్సేపు నటించాడు.

"ఇంట్లో చేసినవి సొక్కవు. బయట నానా గడ్డీ తినొస్తే ఇంక అన్నాలెందుకు?" సుందర మూర్తి తల్లి అన్నది వెటకారంగా.

"నేనేం బయట తిని రాలేదు." కార్తీక్ పౌరు షంగా అన్నాడు.

"మరి అన్నం ఎందుకలా కెక్కరించి తిన్నా వ్?"

"నువ్వు చూశావా నేనెలా తిన్నానో?... నా కెంత కావాలో అంత తిన్నాను".

"తెలుస్తూనే ఉంది నువ్వెలా తిన్నావో..."

మనవడూ, నానమ్మా అలా వాదులాడు కుంటూంటే ప్రభావతి గదిలోంచి బయటికి రాలేదు. ఇక చూసిచూసి సుందరమూర్తి కొడు కుని మందలించాడు.

"ఇక నువ్వు నోరుమూసుకుని లోపలికి వెళ్ల రా..." అని.

తండ్రి మందలింపుతో కంచం సింక్‌లో పడేసి, చేయి కడుక్కుని గదిలోకి వెళ్లి తల్లి పక్కనే పడుకున్నాడు కార్తీక్ సణుక్కుంటూ.

కొడుకు సుందరమూర్తి కలుగజేసుకోవ డంతో ఇంక ఆవిడ ఏమీ మాట్లాడలేదు. హాల్లో లైటు తీసి గదిలోకి వచ్చాడు సుందరమూర్తి. ప్రభావతి కళ్లు మూసుకుని పడుకుని ఉంది.

అతనికి తల్లీ, వాళ్లకి నానమ్మా అయిన ఆవిడతో పిల్లలు వాదులాటలు, అలగడాలు, అన్నాలు మానేసి వాళ్లు కాలేజికి వెళ్లిపోవడాలూ వారంలో నాలుగైదుసార్లు జరిగే తంతే.

పరిస్థితులు మారాయి. జీవన విధానం మారింది. ఈ తరం వారిలో ఆహారపుటలవా ట్లూ మారాయి. స్థిమితంగా ఆకు వేసుకునో, కంచం పెట్టుకునో ఒక్కో ఐటమూ కలుపుకొని, కబుర్లు చెప్పుకుంటూ తినే కాలం కాదిది.

ఆ రోజులు మారిపోయి చాలా కాలమ యింది. ఆ మారిన కాలం కూడా ఇంకా వేగం గా పరిగెడుతోంది. ఇంకా ఆ పాతకాలపు వంట లూ, కూరలూ, పచ్చళ్లు, పులుసులూ చేస్తుం టుంది సుందరమూర్తి తల్లి. ఆవిడకి తన కొడు కు సుందరమూర్తికి ఇష్టమైనవి చేసి పెట్టాలన్న ఆరాటమే!

'నా యిష్టం కాదమ్మా! నీ మనవలకి ఏం యిష్టమో అది చేసి పెట్టు' అంటాడు సుందర మూర్తి.

ఆ మాట ఆవిడ పట్టించుకోదు. పిల్ల వెధ వలు, వాళ్లకేం తెలుసు? అంటుంది. ఇదొక్కటే కాదు. పిల్లలు లేచిన దగ్గర్నుంచి పడుకునే దాకా, వాళ్లు ఇంట్లో ఉన్నంత సేపూ కనీసం రెండు రోజులకోసారైనా ఏదో ఒక విషయంలో వాదులాట లేకుండా ఇల్లు గడవడం లేదు.

చివరికి ఉదయం ఇంటి నుంచి ఆఫీసుకి బయలుదేరడం ఒక ఎత్తయితే, సాయంత్రం ఇంటికి రావడం భయం భయంగా అనిపిస్తోంది ప్రభావతికి. ఇంట్లో ఏ రణగొణ యుద్ధం జరి




గిందో, లేక జరుగుతోందో అని ఆందోళన పడి పోతోంది మధ్య.

రానురాను ఆమె ప్రశాంతత కోల్పోతోంది. సహనమూ నశిస్తోంది. పి.జి., ప్రొఫెషనల్ కోర్సులు కావడం వల్ల సెమినార్లని, ప్రోజెక్టు వర్కులనీ పిల్లలూ సతమతమవుతూ, వాళ్లూ సహనం కోల్పోతున్నారు.

"రోజూ ఏమిటీ గోల ఇంట్లో? నా వల్ల కావడం లేదు... పిల్లల్ని హాస్టల్‌లో పడెయ్యండి..." ఏ ఉపోద్ఘాతమూ లేకుండా అన్నది భర్తతో ప్రభావతి. అతన్ని సాయంత్రం ఫోన్ చేసి హోటల్‌కి రమ్మన్నది.

సుందరమూర్తి మాట్లాడలేదు. ఈ సమస్యకి పరిష్కారం ఏమిటో అతనికీ తోచడంలేదు.

"వాళ్లని వృద్ధాశ్రమాలకు పంపించి చెడ్డ పేరు తెచ్చుకోవడం నాకిష్టం లేదు. అలాగని మీ తమ్ముడి దగ్గరికి పంపమనీ నేను అనను. వాళ్లకైనా ఇలాంటి సమస్యలు రావని గ్యారంటీ ఏమీ లేదు... కానీ, దీనికి తక్షణం ఏదో ఒక సొల్యూషన్ కావాలి... నా వల్ల కావడం లేదు బాబూ... రోజూ గొడవేనా...? తిన్నది వంట బట్టడం లేదు. ఇంటినుంచి బయటికి వెళ్లాలంటే భయం. ఇంటికి రావాలంటే భయం... ఐ కాంట్ బేర్ దిస్..." అయిష్టంగా దోసె తింటూ అన్నది ప్రభావతి.

సుందరమూర్తి కూడా సీరియస్‌గానే ఆలోచిస్తున్నాడు ఏం చేద్దామా? అని.

"నేనే గనక గయ్యాళి కోడల్ని అయిఉంటే పరిస్థితి ఇంకా ఎలా ఉండేదో ఆలోచించండి..." భర్త ముఖంలోకి చూస్తూ అన్నదామె.

అతనేమీ సమాధానం చెప్పలేకపోయాడు. భార్య అన్నట్లే గనుక అయివుంటే ఇల్లు ఒక భయంకర నరకంగానే ఉండేది. ఆ మేరకు తను అదృష్టవంతుడు. ఆ మాటే అన్నాడు.

"నేనేదో గొప్పదాన్నని చెప్పడం కాదు. మరో ఏంగిల్ నుంచి కూడా ఆలోచించా

నంతే!... నేను చెప్పినట్లు పిల్లల్ని హాస్టల్‌లో వేసెయ్యండి" అన్నదామె.

"సరే! అలాగే చేద్దాం..." కాస్సేపయ్యాక అన్నాడు.

మామూలుగానే రిజర్వుడుగా ఉండే మనిషి సుందరమూర్తి. ఇలాంటి సందర్భాల్లో, లోపల్లో పల మదనపడిపోతాడే తప్ప పైకి ఏమీ అన లేదు.

ఇద్దరూ లేచారు. కొంత దూరం నడుచు కుంటూ వచ్చారు. అతనికి టూ వీలర్ వెహికిల్ ఉంది. కానీ, కంపెనీ బస్సులోనే ఆఫీసుకు వెళతాడు. నడుస్తున్నంతసేపూ ఆమె ఇంటి విష యాలే చెప్తోంది. అవన్నీ నానమ్మా, మనవలూ పడుతున్న వాదులాటలే, చికాకులే!

ఆ రాత్రి ఎనిమిది గంటల సమయంలో వరండాలో కుర్చీలో కళ్లుమూసుకుని కూర్చున్న తండ్రి దగ్గరకు వచ్చాడు సుందరమూర్తి. కళ్లు తెరవలేదాయన. కానీ, వచ్చింది కొడుకే అని గ్రహించాడు.

"నాన్నా" నెమ్మదిగా పిలిచాడు.

ఆయన కొద్దిగా కళ్లు తెరిచి కూర్చో అన్నట్లు సౌంజ్ఞ చేశాడు.

"ఏం లేదు! పిల్లల్ని హాస్టల్‌లో చేరుద్దామను కుంటున్నాను" అన్నాడు ఆయన పక్కన కుర్చీలో కూర్చుంటూ. ఆయన పూర్తిగా కళ్లు తెరిచాడు.

"రోజూ ఇంట్లో పరిస్థితి చూస్తున్నావు కదా!" అన్నాడు. ఆయన తల పంకించాడు.

అంతకుమించి మాట్లాడ్డానికి సుందరమూ ర్తికి మాటలు దొరకలేదు. మరో పది నిమిషాలు కూర్చుని లేచి ఇంట్లోకి వచ్చేశాడు. తండ్రి అలా విని ఊరుకోవడం అతనికి అసంతృప్తిగా అని పించింది. మీ నాన్న ఏమన్నారని ప్రభావతి అడగనూ లేదు, అతను చెప్పనూ లేదు.

పిల్లలిద్దరికీ రాత్రి పడుకోబోయే ముందు చెప్పింది ప్రభావతి హాస్టల్‌లో చేరుస్తున్న విష యం.

"అదే బెటర్" అన్నాడు కార్తీక్. స్మిత సమా ధానం చెప్పలేదు.

మర్నాడు ఉదయం ప్రశాంతంగా గడిచిపో యింది. సాయంత్రం ప్రభావతి ఇంటికి వచ్చే సమయానికి బయటికి వెళ్లడానికన్నట్లు వరం డాలో కూర్చుని ఉన్నారు అత్తమామలు.

"మేం టీ తాగాం. నీకు ఫ్లాస్కులో పోసి పెట్టాను" అన్నది అత్తగారు.

ప్రభావతికి కొంచెం ఆశ్చర్యంగా అనిపిం చింది. ఇద్దరూ అలా కలసి బయటికి వెళ్లడం చాలా అరుదు. ఏవైనా ఫంక్షన్‌కి, బంధువులిం టికీ వెళ్లాలంటే తప్ప ఇద్దరూ అలా వెళ్లడం చాలా అరుదే. మామగారు మాత్రం సాయం త్రం అలా బయటికి వెళ్లి ఓ గంటా రెండు గంటలు కాలక్షేపం చేసి ఏడూ ఏడున్నరకి ఇంటికొస్తుంటాడు.

భార్యని తీసుకుని బయలుదేరాడాయన. పగలల్లా ఇంట్లో ఇద్దరే ఉంటారు. కొంతసేపు ఆవిడతో ఇంటి విషయాలు చాలా మాట్లాడాడా యన. ఇప్పుడు దానికి కొనసాగింపుగా మాట్లా డ్డానికే భార్యను బయటికి తీసుకువెళ్లాడు.

విశాలమైన గుడి ప్రాంగణంలో అక్కడక్కడా చాలామంది కూర్చుని ఏవేవో మాట్లాడుకుంటు న్నారు. రావిచెట్టూ, వేపచెట్టూ కలిసి ఉన్న చోట సిమెంటు చప్టామీద కూర్చున్నాడు. ఆవిడా కూర్చున్నది. పది నిమిషాలు ఇద్దరి మధ్యా మౌనం.

"చూడు! చదువుకుని, పదిపదిహేను వేలు జీతం తెస్తూ వినయంగా ఉండే కోడలు దొరకడం మన పూర్వజన్మ సుకృతం!..." ఉపోద్ఘాతంగా మొదలుపెట్టాడాయన. ఆవిడ సర్దుకుని కూర్చుంది.

"అందుకు తగ్గట్టే కొడుకూను... ఇక మనవలంటావా? వాళ్లు ఈ తరం వాళ్లు. మనకి రెండో తరం వాళ్లు... నీ చిన్నప్పటికీ, మన సుందరం పెద్దయ్యేప్పటికీ పరిస్థితుల్లో ఎంత మార్పొచ్చింది?... అలాంటిది వాడి పిల్లల కాలం వచ్చేసరికి మరింకెంత మార్పొస్తుంది? అంతెందుకు? మీ అమ్మ చీర ఎలా కట్టుకునేది? నీ తరం వచ్చేసరికి నువ్వు చీర ఎలా కట్టుకుంటున్నావ్? మన కోడలు ఉద్యోగం చేస్తోంది. రకరకాల ఆడ, మగ వాళ్ల మధ్య. చెయ్యక తప్పదు అనుకుంటే ఆమె మీద మనం విశ్వాసం ఉంచుకోవాలి. ఇది అనివార్యం. ఆమె కూడా సంపాదిస్తోంది కనకనే మనకి వేళపట్టున కాఫీలు, టిఫిన్లు, మందులు, అవసరమైతే వందల ఫీజులు పోసి వైద్యం... ఇవన్నీ సాధ్యమౌతున్నాయి..."

ఆవిడ వింటున్నదీ లేనిదీ చూద్దానికన్నట్లు కాస్సేపు ఆగాడాయన. ఆమె వింటోంది.

"నువ్వు పిల్లలతో రోజూ గొడవ పడతావెందుకు? వాళ్లెవరు? నీ మనవలు. ఒకవేళ నీ కొడుకే వాళ్లని తిట్టినా మనం వాళ్లని వెనకేసుకురావాలి... నీకు వాళ్లమీద ప్రేమలేదని చెప్పను. బహుశా అది హద్దులు దాటిన ప్రేమైనా అయ్యుండాలి... చూడూ! ఈ వయసులో మనం ఇంటికి సలహాదారుల్లా ఉండాలి. కాపలాదారుల్లా ఉండాలి. ఒకవేళ పిల్లలు తప్పుదారుల్లో నడుస్తూంటే మందలించడం తప్పనిసరి. కానీ అది రోజూ ఒక అలవాటుగా ఉండకూడదు. నీ బిడ్డల్ని నువ్వెలా పెంచావో, వాళ్ల బిడ్డల్ని కాలానుగుణంగా వాళ్లూ అలానే పెంచుకుంటారు. చేతనైతే మనం సాయపడాలి... పిల్లల్ని హాస్టల్లో చేర్పించే పరిస్థితి తెచ్చేకన్నా మనం ఏ వృద్ధాశ్రమానికో వెళ్లడం మంచిది..." ఇక చెప్పడం అయిపోయిందన్నట్లు ఆయన ఊపిరి పీల్చుకున్నాడు.

ఆవిడ ఏం మాట్లాడలేదు. కళ్లు మూసుకుని కాస్సేపు మౌనంగా కూర్చుండిపోయింది. తర్వాత కళ్లు వత్తుకున్నది. మరో పావుగంటకి ఇద్దరూ బయల్దేరారు.

రాత్రి తొమ్మిదింటికి కాలింగ్ బెల్లు మోగడంతో నానమ్మ తలుపు తీసింది చిరునవ్వుతో. 'ఇప్పుడు టైమెంత?' అన్న గద్దింపు వినబడకపోయేసరికి స్మిత ఆశ్చర్యపోయింది. మరో ఇరవై నిమిషాలకు వచ్చిన కార్తీక్ కూడా అదే ఆశ్చర్యానికి లోనయ్యాడు.

ఆవిడే కంచాలు పెట్టింది డైనింగ్ టేబుల్ మీద. మళ్లీ సీను మారకుండా భోజనం చేసేస్తే మంచిది కదాని స్మిత, కార్తీక్ వచ్చి కూర్చున్నారు.

"బెండకాయ ఫ్రై రా... అంటూనే ఇద్దరికీ చెరో కర్రీపఫ్ ఇచ్చి, ముందు ఇది తినేసి... ఎంతాకలేస్తే అంతా అన్నం తినండి..." అంది నానమ్మ.

వాళ్లకి మరో ఆశ్చర్యం!... షాక్ తగిలినట్లయ్యారు. వాళ్లిద్దరూ ఆమెని తేరిపారచూశారు.

"నేను మీ నానమ్మనే... తినండి..." అన్నదావిడ.

ఇదంతా గమనిస్తున్న ప్రభావతి హాల్లో ప్రశాంతంగా కూర్చున్న మామగారికేసి కృతజ్ఞతగా చూసింది. ●